# బీఆర్ఎస్‌లోకి పొన్నాల..

- లక్ష్మయ్యతో మంత్రి కేటీఆర్ భేటీ
- కాంగ్రెస్ బీసీల వ్యతిరేక వైఖరిపై చర్చ
- పొన్నాల నిర్ణయంతో ఆ పార్టీకి బీసీలు దూరమయ్యే అవకాశం
- అసెంబ్లీ ఎన్నికలకు ముందే ఉమ్మడి జిల్లాలో 'హస్త'వ్యస్తం

వరంగల్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్‌లో బీసీలకు జరుగుతున్న అన్యాయంపై గలమెత్తిన మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య కీలక నిర్ణయం తీసుకున్నారు. వెనుకబడిన వర్గాలకు గుర్తింపు ఇచ్చే బీఆర్ఎస్‌లో చేరేందుకు అంగీకరించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా వెళ్లి హైదరాబాద్‌లోని పొన్నాల నివాసంలో ఆయనతో భేటీ అయ్యారు. కాంగ్రెస్ కేంద్ర, రాష్ట్ర నాయకత్వాలు అనుసరిస్తున్న బీసీల వ్యతిరేక వైఖరిని, ఈ వర్గాలకు ప్రాధాన్యం ఇస్తున్న బీఆర్ఎస్ విధానాలపై చర్చించారు. అనంతరం పొన్నాల బీసీ వర్గాలకు ప్రాధాన్యమిచ్చే బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నారు. రెండు రోజుల్లో బీఆర్ఎస్‌లో చేరుతారని తెలిసింది. సోమవారం చేరిక కార్యక్రమం ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. కాంగ్రెస్‌పై పొన్నాల తిరుగుబాటు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది. తెలంగాణ ఏర్పాటు నుంచి కాంగ్రెస్‌లో బీసీలను అణగదొక్కుతున్న తీరును ఆ పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. 2014 ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న తనను కాంగ్రెస్ అధిష్ఠానం అకారణంగా తొలగించిందని, అప్పటి కంటే 2018లో దారుణమైన ఫలితాలు వచ్చినా పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై చర్యలు తీసుకోకపోగా, అదనంగా పదవులు ఇచ్చారని అంటున్నారు. మాజీ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న పొన్నాలపై పీసీసీ నాయకత్వమే రాజకీయంగా కుట్రలు చేస్తుండడంపై మొదటి నుంచి కాంగ్రెస్‌లో ఉంటున్న వారు తప్పుబడుతున్నారు. ప్రస్తుత నాయకత్వం హయాంలో కాంగ్రెస్ పూర్తిగా మారిపోయిందని, ఇతర పార్టీల పెత్తనం పెరిగిందని చెబుతున్నారు. అసలైన కాంగ్రెస్ నేతలకు అవమానాలు ఎదురవుతున్నాయని, బయటి నుంచి వచ్చిన వారికి అవకాశాలు ఇస్తున్నారని అంటున్నారు.

ఉమ్మడి జిల్లాలో కీలకమైన బీసీ నేతగా పొన్నాలకు గుర్తింపు ఉన్నది. 1989, 1999, 2004, 2009 ఎన్నికల్లో ఆయన జనగామ నుంచి కాంగ్రెస్ తరపున ఎమ్మెల్యేగా గెలిచారు. 1985, 1994, 2014, 2018 ఎన్నికల్లో ఓడిపోయారు. నలభై ఏండ్లు కాంగ్రెస్‌లో కీలకంగా పని చేసిన పొన్నాల పీసీసీ అధ్యక్షుడిగానూ పని చేశారు. బీసీల్లో బలమైన నేతగా ఉన్న తన విషయంలో కాంగ్రెస్ ప్రస్తుత నాయకత్వం వ్యవహరించిన తీరుపై పొన్నాల తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇన్నాళ్లు భరిస్తూ వచ్చిన లక్ష్మయ్య శుక్రవారం తిరుగుబాటు చేశారు. బీసీలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలను వివరించారు. సుదీర్ఘకాలం అనుబంధం ఉన్న కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు. పొన్నాల రాజీనామాతో బీసీ వర్గాలకు కాంగ్రెస్ చేస్తున్న అన్యాయంపై ఉమ్మడి వరంగల్ జిల్లాలో, రాష్ట్ర వ్యాప్తంగా చర్చ మొదలైంది. పొన్నాల నిర్ణయంతో బీసీ వర్గాలు కాంగ్రెస్‌కు పూర్తిగా దూరమయ్యే పరిస్థితి వచ్చింది.

## కాంగ్రెస్ ఖాళీ..

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలు గులాబీ పార్టీనే ఆదరిస్తున్నారు. ప్రతి ఎన్నికల్లోనూ బీఆర్ఎస్‌కు ఘనవిజయం చేకూరుస్తున్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ మరింత బలహీనపడి ఎన్నికల్లో పదిలోపు సీట్లకు తగ్గిపోయిన పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ నాయకత్వం తీరుతో కాంగ్రెస్ సీనియర్ నేతలు, పేద వర్గాలు ఆ పార్టీకి దూరమవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ సీనియర్ నేతలు చాలా మంది బీఆర్ఎస్‌లో చేరారు. ప్రజలు ఉన్న వైపే తాము ఉండాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎంపీలు, జిల్లా, మండల స్థాయి ప్రజాప్రతినిధులు వందల మంది చేరారు. ఇంకా చేరుతూనే ఉన్నారు.

# పశ్చిమ కాంగ్రెస్‌లో డిష్యుం డిష్యుం

- జంగా పార్టీ మారుతాడని నాయిని అనుచరుడి పోస్టు
- పోలీస్ స్టేషన్‌లో జంగా ఫిర్యాదు
- అయోమయంలో పార్టీ శ్రేణులు

వరంగల్, అక్టోబర్ 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కొట్లాటలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇటీవలి వరకు మాటకు మాట ఉండేది. ఇప్పుడు కొట్లాటలు, ఘర్షణలు, పరస్పరం కేసుల దశ నడుస్తున్నది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో రెండు వర్గాల లొల్లి మరోసారి బజారున పడింది. డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి మధ్య టికెట్ల పోరు తీవ్రమైంది. పెద్దమ్మగడ్డ ప్రాంతంలో ఇటీవల రెండు వర్గాల నేతలు కొట్టుకున్నారు. పాదయాత్ర సందర్భంలో ఒకవర్గంపై మరో వర్గం దాడి చేయడం, ఆ తర్వాత రెండు వర్గాల వారు రోడ్డుపైనే కొట్టుకుని కేసులు పెట్టుకున్నారు. తాజాగా మరో వివాదం చెలరేగింది. జంగా రాఘవరెడ్డి పార్టీ మారుతున్నాడంటూ నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు తోట పవన్ సోషల్ మీడియాలో పోస్టు పెట్టాడనే విషయంలో ఇది మొదలైంది. దీనిపై జంగా సుబేదారి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తాను పార్టీ మారుతున్నానంటూ ఉద్దేశపూర్వకంగా తనను కించపరిచేలా పోస్టులు పెట్టిన తోట పవన్‌పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. నాయిని ప్రోద్బలంతోనే ఇదంతా జరుగుతున్నదని రాఘవరెడ్డి వర్గం ఆరోపిస్తున్నది. టికెట్ విషయం కాంగ్రెస్ అధిష్ఠానం తేలుస్తుందని, ఇప్పుడు సోషల్ మీడియా పోస్టులు పెట్టడం వెనుక నాయిని కుట్ర ఉన్నదని అంటున్నది. రాఘవరెడ్డిపై నాయిని వర్గం తీవ్రమైన ఆరోపణలు చేస్తున్నది. రాఘవరెడ్డి ప్రతి ఎన్నికలకు ఒక అసెంబ్లీ సెగ్మెంట్‌లో పెత్తనం చేస్తూ, పార్టీకి నష్టం చేస్తున్నాడని నాయిని వర్గం అంటున్నది. కాంగ్రెస్‌లోని రెండువర్గాల లొల్లి ఇప్పుడు ఆ పార్టీకి ఇబ్బందికరంగా మారింది. ఎన్నికల తరుణంలో సొంత పార్టీలోని నేతలే పరస్పరం కొట్టుకుని కేసులు పెట్టుకోవడంపై జనాలు నవ్వుకుంటున్నారు. వరంగల్ పశ్చిమ(హనుమకొండ) నియోజకవర్గం బీఆర్ఎస్‌కు కంచుకోటగా ఉన్నది. బీఆర్ఎస్(టీఆర్ఎస్) ఆవిర్భావం నుంచి ఇదే పార్టీ గెలుస్తున్నది. వరుసగా ఐదుసార్లు గులాబీ పార్టీ ఇక్కడ విజయం సాధించింది. 1998 ఉప ఎన్నిక తర్వాత కాంగ్రెస్ ఈ స్థానంలో ఎప్పుడూ గెలవలేదు. రెండున్నర దశాబ్దాలుగా ఇక్కడ ప్రాతినిథ్యం లేకపోవడంతో కాంగ్రెస్‌కు ఈ సెగ్మెంట్‌లో బలం లేకుండాపోయింది. ఇప్పుడు గ్రూపుల రాజకీయం ఆ పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తున్నది.

## రెండేండ్లుగా..

వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్‌లో రెండు వర్గాల మధ్య ఘర్షణ రెండేండ్లుగా కొనసాగుతున్నది. గత ఏడాది రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనకు వచ్చినప్పటి నుంచి ఇది పరాకాష్టకు చేరుకున్నది. రెండు వర్గాలు పరస్పరం కొట్టుకోవడం సాధారణ విషయంగా మారింది. నాయిని, జంగా మధ్య పోరు తీవ్రమవుతున్నది. పోటాపోటీగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వీరిద్దరి మధ్య, వీరి వర్గాల మధ్య నిత్యం కొట్లాటలు జరుగుతున్నాయి. 2018 ఎన్నికల్లో పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన జంగా ఆ తర్వాత తన రాజకీయ కేంద్రాన్ని వరంగల్ పశ్చిమ సెగ్మెంట్‌కు మార్చుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు. నాయిని రాజేందర్‌రెడ్డికి పోటీగా జంగా హంటర్ రోడ్డులో సొంత కార్యాలయాన్ని ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ కార్యాలయం అని దీనికి బోర్డు పెట్టారు. కాంగ్రెస్ జాతీయ, రాష్ట్ర స్థాయి అగ్రనేతలతో కలిపి జంగా ఫొటోతో దీనికి బోర్డును ఏర్పాటు చేశారు. జంగా ఆఫీసు ప్రారంభం వ్యవహారంపై నాయిని వర్గం డీసీసీ ఆఫీసు కేంద్రంగా పార్టీ కార్యక్రమాలు చేస్తున్నది. ఇద్దరూ వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తామని ప్రకటనలు చేయడంతో రెండు వర్గాల మధ్య ఘర్షణలు మొదలయ్యాయి. ఇవి కొనసాగుతూనే ఉన్నాయి.

### నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరుడు పవన్‌పై కేసు

సుబేదారి : నాయిని రాజేందర్‌రెడ్డి, జంగా రాఘవరెడ్డి మధ్య వివాదం తారాస్థాయికి చేరింది. కొద్ది రోజుల క్రితమే పెద్దమ్మగడ్డలో జంగా రాఘవరెడ్డి ర్యాలీని నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు అడ్డుకున్నారు. ఈ సమయంలో ఇరువర్గాలు తన్నుకొని హనుమకొండ పోలీసు స్టేషన్‌లో పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నారు. పోలీసులు ఇరువర్గాలపై కేసులు నమోదు చేశారు. ఈ ఘటన జరిగి వారం కూడా కాలేదు. తాజాగా రాజేందర్‌రెడ్డి ప్రధాన అనుచరుడు తోట పవన్, జంగా రాఘవరెడ్డి బీఎస్పీలో చేరుతున్నాడని సోషల్‌మీడియాలో పెట్టి వైరల్ చేశాడు. దీన్ని సీరియస్‌గా తీసుకున్న రాఘవరెడ్డి సుబేదారి పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేయగా, తోట వపన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ షుకూర్ తెలిపారు. కాగా, శనివారం రాఘవరెడ్డి సుబేదారి స్టేషన్‌కు వచ్చి పవన్‌పై నమోదు చేసిన ఎఫ్ఐఆర్ కాపీ తీసుకున్నారు.



జేఎన్ఎస్‌లో జరిగే సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌కు రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న పలు రాష్ట్రాల అథ్లెట్లు

# నేటి నుంచి జేఎన్ఎస్‌లో సౌత్‌జోన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

- ఈ నెల 17వ తేదీ వరకు క్రీడా పోటీలు
- 140 ఈవెంట్లలో పాల్గొననున్న 840 మంది క్రీడాకారులు
- ప్రారంభించనున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ చౌరస్తా, అక్టోబర్ 14 : హనుమకొండ నగరం మరోసారి క్రీడా సంబురాలకు వేదిక కానుంది. 34వ సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం(జేఎన్ఎస్) ముస్తాబైంది. రెండో జాతీయస్థాయి పోటీలు నిర్వహించేందుకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఏఎఫ్ఐ) సహకారంతో ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 840 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. 140 ఈవెంట్లలో పోటీలను నిర్వహించనున్నారు. అంతర్జాతీయస్థాయి క్రీడాకారులు సైతం వరంగల్‌కు రానున్నారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు కలెక్టర్ సిక్తా పట్నాయక్ పోటీలను ప్రారంభించనున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో ఫిజియోథెరపిస్ట్ మృతి



మణిదీప్ (ఫైల్)

నర్సంపేట, అక్టోబర్ 14 : రోడ్డు ప్రమాదంలో ఫిజియోథెరపిస్ట్ మృతి చెందిన ఘటన నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. శనివారం ఫిజియోథెరపిస్ట్ ఆదిరెడ్డి మణిదీప్(30) చెన్నారావుపేటకు చెందిన రోగి వద్దకు వెళ్లి వస్తున్నాడు. కాకతీయనగర్ సమీపంలో రోడ్డుపై ఉన్న గుంతలోకి బైక్ దూసుకెళ్లగా, అదుపుతప్పి మణిదీప్ కింద పడిపోయాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న టాటా సుమోకు అతడి తల తాకడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో తీవ్ర రక్తస్రావం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. పదమూడు సంవత్సరాల క్రితం అతడి తల్లిదండ్రులు అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మణిదీప్ నాయనమ్మ దగ్గర ఉంటున్నాడు. మణిదీప్ మృతితో అతడి స్వగ్రామమైన మహేశ్వరంలో విషాదం అలుముకుంది. నర్సంపేట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం దవాఖానకు తరలించారు.

## అనారోగ్యంతో ములుగు కలెక్టరేట్ సూపరింటెండెంట్..



సంజీవ (ఫైల్)

పోచమ్మమైదాన్, అక్టోబర్ 14 : ములుగు జిల్లా కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న జన్ను సంజీవ అనారోగ్యంతో బాధపడుతూ వరంగల్ దేశాయిపేటలో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కొంతకాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతూ హైదరాబాద్ కేర్ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. ఆరోగ్యం విషమించి మృతి చెందాడు. ఆయన మృతదేహాన్ని సొంత గ్రామమైన దేశాయిపేటకు తీసుకువచ్చారు. ఆయన మృతికి ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే బండి పుల్లయ్య, పలువురు రెవెన్యూ ఉద్యోగ సంఘాల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ములుగు అడిషనల్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు మహ్మద్ ఇక్బాల్, గుండాల నాగరాజు, శ్రీపాల్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సంజీవ గతంలో హనుమకొండ, డోర్నకల్, నర్సంపేట, కొడకండ్ల, కురవి, ఏటూరు నాగారంలో తహసీల్దార్‌గా పనిచేసి, ప్రస్తుతం ములుగు కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు.

# జోనల్ స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

పర్వతగిరి, అక్టోబర్ 14 : మండలంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో 7వ జోనల్ స్థాయి క్రీడా పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ప్రిన్సిపాల్ మాధవీలత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గురుకులాల అడిషనల్ సెక్రటరీ మాధవీదేవి హాజరయ్యారు. 14 నుంచి 17 సంవత్సరాల్లోపు, 19 సంవత్సరాల్లోపు వయసు బాలికల విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, ఆర్చరీ, హాకీ, బాక్సింగ్, రెజ్లింగ్, బాల్‌బ్యాడ్మింటన్, రగ్బీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల నుంచి 15 పాఠశాలలు, కళాశాలలకు చెందిన 550 మంది క్రీడాకారులు పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో క్రీడా పోటీల ఇన్‌చార్జి ఎం రమణ, పర్యవేక్షణాధికారి డీఎస్ వెంకన్న పాల్గొన్నారు.



క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న గురుకులాల అడిషనల్ సెక్రటరీ మాధవీదేవి